క్లుప్తంగా

18న జాబ్‌మేళా

దొనకొండ: స్థానిక గౌతమి విద్యా సంస్థల ఆధ్వర్యంలో 18వ తేదీన మార్కాపురం గౌతమి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన వారికి రూ.15 వేల నుంచి రూ.25 వేల జీతం ఉంటుందన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ గుండారెడ్డి కోరారు.

నేడు కోటి సంతకాల రచ్చబండ

దర్శి: మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నగర పంచాయతీ పరిధిలోని కొత్తరెడ్డిపాలెంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముత్తినీడి సాంబయ్య తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరవుతారన్నారు. యువత, విద్యార్థులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో అజిత

తాళ్లూరు: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో పి.అజిత సూచించారు. మండలంలోని విఠలాపురం సచివాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు పరిశీలించారు. అన్ని ప్రభుత్వ సర్వేల్లో ముందంజలో ఉండాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, గ్రామంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి షెహనాజ్ బేగం, వీఆర్వో ఎం.రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిస్తే..అంతే సంగతులు!

- ప్రయాణికుల్లా నటిస్తూ దోచుకుంటున్న దొంగలు
- రద్దీ వేళల్లో బస్టాండ్‌ల్లో అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



బస్టాండ్ వద్ద బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

పెద్దదోర్నాల: ఇటీవల పండగలు, యాత్రల పేరుతో పలువురు ఎక్కువగా ప్రయాణాలు చేస్తుండటంతో ఆర్టీసీ బస్టాండ్‌లు రద్దీగా మారుతున్నాయి. దసరా సెలవుల తర్వాత శని, ఆదివారాలు, మరో ఐదు రోజుల తర్వాత దీపావళి పర్వదినం ఇలా క్రమం తప్పకుండా వచ్చే సెలవు దినాల నేపథ్యంలో బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు మరింత రద్దీగా కిటకిటలాడుతున్నాయి. దీంతో ఇదే అదనుగా కొందరు దొంగలు ప్రయాణికుల ముసుగుతో నగదు, నగలు, పర్సులు, బ్యాగులు కాజేస్తుంటారు. ఇలాంటి ఘటనలు మండల కేంద్రంలో ఎన్నో చోటు చేసుకున్నాయి. ప్రయాణికులు బస్సులు ఎక్కే సందర్భాల్లో రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడే ఆగంతకులు చేతివాటం చూపుతున్నారు. సీటు దొరుకుతుందా లేదా అనే ఆతృతలో ప్రయాణికులు ఏమరుపాటుగా ఉన్న సమయాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని చోరీలకు పాల్పడుతున్నారు. జిల్లాకు అత్యంత సమీపంగా ఉండే నంద్యాల జిల్లా నుంచి వచ్చిన కొందరు ఆగంతకులు చోరీలకు పాల్పడుతున్నారన్న అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అత్యంత రద్దీ సమయాల్లో అదను చూసి ప్రయాణికుల్లా వచ్చి పక్కనే కూర్చొని కబుర్లలో దింపి మాటలు కలుపుతారని, దీంతో ఈ సమయంలోనే మనం కాస్త అదమరుపులో ఉన్నప్పుడే పర్సు, బ్యాగులు కాజేసి మాయమవుతుంటారని పేర్కొంటున్నారు. చోరీ తర్వాత సీసీ పుటేజీలు పరిశీలించినా వారి ఆచూకీ తెలుసుకోవటం పెద్ద సమస్యగా మారుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రయాణికుల్లా తిరుగుతూ..

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ అనునిత్యం యాత్రికులతో రద్దీగా ఉంటోంది. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులతో పాటు సుదూర ప్రాంతాలకు వెళ్లే యాత్రికులతో నిరంతరం కిటకిటలాడుతుంటోంది. ఆ సమయాలల్లో బస్సుల కోసం ఎంతో మంది వేచి ఉంటారు. దీంతో బస్సుల కోసం వేచి ఉండేలా నటించే ఆగంతకులు సైతం మన పక్కనే వచ్చి ప్రయాణికుల్లా కూర్చుంటారు. ఆ సమయంలో మన ఏమరపాటును అవకాశంగా మరల్చుకొని చాకచక్యంగా బ్యాగు, ఇతర వస్తువులతో ఉడాయిస్తారు. ఇటీవల మండల పరిధిలోని మోట్ల మల్లికార్జునపురానికి చెందిన ఓ మహిళ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు ఎక్కే ప్రయత్నం చేసింది. ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో అతి కష్టంపై బస్సెక్కి సీటు సంపాదించింది. తీరా కూర్చున్నాక చూస్తే ఆమెకు సంబంధించిన బ్యాగు, పర్సు కనిపించలేదు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఎన్నో సార్లు ఇలాంటి చోరీ సంఘటనలు చోటుచేసుకున్నాయి.

నగలు, నగదుతో ప్రయాణం చేయవద్దు: ప్రయాణికులు వీలైనంత వరకు నగదు, నగలు, ఇతర విలువైన వస్తువులతో ప్రయాణాలు చేయవద్దు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు నెట్టుకుంటూ బస్సు ఎక్కే ప్రయత్నం చేయవద్దు. మండల కేంద్రంలో ఎక్కువ రద్దీ ఉంటుంది. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి.

– మహేష్, ఎస్సై, పెద్దదోర్నాల

చిరస్మరణీయుడు అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న నాయకులు

యర్రగొండపాలెం: మాజీ రాష్ట్రపతి, ఇస్రో శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్ అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కలలు సాకారం చేసుకోమని యువకుల్లో నూతన ఉత్తేజాన్ని పెంపొందించారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల అరుణ, వివిధ విభాగాల జిల్లా కార్యదర్శులు కె.ఓబులరెడ్డి, ఆర్.అరుణాబాయి, వై.వెంకటేశ్వరరెడ్డి, ముస్లిం విభాగం నాయకులు ఎం.కరీముల్లా బేగ్, సయ్యద్ జబీవుల్లా, షేక్ అబ్దుల్ ఖాశిం, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, ఒంగోలు సుబ్బారెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసులు, దోగిపర్తి సంతోష్‌కుమార్, సూరె శ్రీనివాసులు, గోళ్ల కృష్ణారావు, పాస్టర్ల సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.సుందరరాజు, టి.రాంబాబు, సింగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దొనకొండ: కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

దొనకొండ: మండలంలోని పోలేపల్లి ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రధానోపాధ్యాయుడు ఆదిమూలపు ప్రభుదాసు మాట్లాడుతూ కలాం భారతదేశపు అత్యున్నత పురస్కారమైన భారత రత్న దక్కించుకున్నారని వివరించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పి.పావని, పాఠశాల చైర్మన్ రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్డురాయి ప్రతిష్ట



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ముండ్లమూరు (దర్శి): ముండ్లమూరు మండలం పసుపగల్లులో బొడ్డురాయి ప్రతిష్ట, కాశి విశ్వేశ్వర స్వామి ఆలయంలో శ్రీచక్ర ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రాలతో శ్రీ చక్రాలను ప్రతిష్టించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో అందరికీ మంచి జరగాలని నేతలు ఆకాంక్షించారు.

వసతి గృహాలకు ఇన్‌చార్జిలే దిక్కు



దొనకొండ బీసీ బాలుర వసతి గృహం

దొనకొండ: మండలంలోని బీసీ బాలురు, బాలికల వసతి గృహాల సంక్షేమాధికారులు బదిలీపై వెళ్లడంతో ప్రస్తుతం ఇన్‌చార్జి సంక్షేమ అధికారులే దిక్కయ్యారు. బీసీ బాలుర అధికారి సురేష్ 3 నెలల క్రితం బదిలీపై వెళ్లగా బీసీ బాలికల సంక్షేమాధికారి ప్రభావతిదేవి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఆమె కూడా నెల క్రితం అద్దంకి అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ప్రమోషన్‌పై వెళ్లారు. ప్రస్తుతం రెండు వసతి గృహాలకు దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాల బీసీ బాలురు, బీసీ బాలికల సంక్షేమాధికారులైన పుల్లారావు, వనజారెడ్డి ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం బీసీ బాలుర వసతి గృహంలో 72 మంది విద్యార్థులు, బీసీ బాలికల వసతి గృహంలో 70 మంది విద్యార్థినులు ఉన్నారు. వారికి ప్రత్యేక సంక్షేమాధికారులు లేక ఇన్‌చార్జిలు ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో బదిలీపై వెళ్లిన అధికారుల స్థానంలో వెంటనే కొత్తవారిని నియమించే వారని, నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యార్థుల సంక్షేమం పాలకులు మరిచిపోయారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నూతన సంక్షేమాధికారులను నియమించాలని కోరుతున్నారు.

చేతులు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



దర్శి: మాట్లాడుతున్న కమిషనర్ మహేశ్వరరావు



పుల్లలచెరువు: చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పుల్లలచెరువు: చేతులు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీవో సంజీవరావు అన్నారు. వరల్డ్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో చేతులు కడిగించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. భోజనం చేసే సమయం, ఆరుబయటకు వెళ్లి వచ్చిన సమయంలోనే కాకుండా ఆటలు ఆడకున్న తర్వాత కూడా తప్పని సరిగా చేతులు పరిశుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఇలా అలవాటు చేసుకుంటే వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే అనే పదాన్ని గుర్తు పెట్టుకుని విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మంచి విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి, ఆర్‌డబ్ల్యూఎస్ కో ఆర్డినేటర్ సామేలు, మాజీ సైనికుడు బుజ్జి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దర్శి: చేతుల శుభ్రతతో వ్యాధులు అరికట్టవచ్చని మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు సూచించారు. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఏటా అక్టోబర్ 15వ తేదీన గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే జరుపుతారని, చేతులను 6 రకాల పద్ధతుల ద్వారా శుభ్రం చేసుకుంటారని చెప్పారు. మెప్మా జీవనోపాధులకు చెందిన బ్రోచర్‌ను ఆర్పీలకు అందించారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ రఘు, కమ్యూనిటీ ఆర్గనైజర్ రవీంద్ర, డీఈవో సురేష్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుభానీ, మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

- ఇష్టానుసారం పెంచిన ఆటో చార్జీలు





కురిచేడు బస్టాండ్ సెంటర్‌లో బస్సుల కోసం వేచి ఉన్న మహిళలు

కురిచేడు: రాష్ట్రంలో నాయకుల కార్యక్రమాలు ఉన్నాయంటే ప్రజలకు ఇబ్బందులు వచ్చిపడుతున్నాయి. గురువారం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రధాని రాక సందర్భంగా బుధవారం నుంచి ఆర్టీసీ బస్సులు ఆగిపోయాయి. ప్రజలను ప్రధానమంత్రి కార్యక్రమానికి తరలించేందుకు ప్రభుత్వం బస్సులు కేటాయించింది. దీంతో ప్రయాణికులకు బుధవారం చుక్కలు కనిపించాయి. ఇటీవల కాలంలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఆటోలకు ప్రయాణికులు లేక డ్రైవర్లు విలవిల్లాడారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల కొరత ఏర్పడటంతో ఆటోవాలాలు ఒక్కసారిగా చార్జీలు ఇష్టానుసారం పెంచి ప్రయాణికుల ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఎక్కడకు వెళ్లాలన్నా ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రులకు వెళ్లే వారు కార్లు బాడగకు మాట్లాడుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతే కాకుండా శుభకార్యాలు జరుగుతుండటంతో మహిళలంతా బుధవారం ఉదయం స్థానిక బస్టాండ్ సెంటర్‌కు చేరారు. ఎంతసేపు ఎదురు చూసినా ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో గత్యంతరం లేక ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వినుకొండ–పొదిలి రూటులో కేవలం మూడు బస్సులు మాత్రమే నడవడంతో ప్రయాణికులు గంటల కొద్దీ వేచి ఉండలేక.. వేచి ఉన్నా బస్సుల్లో ఖాళీ లేక తొక్కిసలాటతో ప్రయాణం చేయలేక నానా ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం నాయకుల కార్యక్రమాలకు కేవలం ఆర్టీసీ బస్సులు కొన్నింటిని తీసుకున్నా ట్రావెల్స్ బస్సులను వినియోగించుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలన్న ఆలోచన కూడా లేకుండా ఆర్టీసీ బస్సులను వినియోగించి ప్రయాణికులను ఇబ్బంది పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిఘటిద్దాం..



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

దొనకొండ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన వాణిజ్య యుద్ధం భారత వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు పేర్కొన్నారు. ట్రంప్ ప్రభుత్వం విధించిన టారీఫ్, టెర్రరిజానికి వ్యతిరేకంగా బుధవారం సీపీఎం కార్యకర్తలు మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్, రైల్వేస్టేషన్‌లో కరపత్రాలు పంచారు. ఆంజనేయులు మాట్లాడుతూ అమెరికా వాణిజ్య సుంకాలతో దేశానికి జరిగే నష్టంపై ప్రజలకు వివరించారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ నామమాత్రమన్నారు. దేశంలో వ్యవసాయం చేసే రైతుల సంఖ్య అమెరికా కంటే ఎక్కువ ఉన్నారని, చాలామంది వ్యవసాయంపై ఆధారపడి జీవించే వారు 65 కోట్ల మందిపైగా ఉన్నారని గుర్తు చేశారు. చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ట్రంప్ టారిఫ్‌పై మౌనం పాటిస్తున్నారని వివరించారు. అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం నిలబడాలని అంజయ్య విజ్ఞప్తి చేశారు. కుందుర్తి చిన్న నరసింహులు, కర్నా కృష్ణ, కురవాటి రామయ్య, కొండా ఫ్రాన్సిస్, ఏసుదాసు, ఉదయ్‌కుమార్, కోటేశ్వరరావు, దేవయ్య, కొండలు, వెంకటయ్య పాల్గొన్నారు.

తనిఖీ చేసిన మద్యం మాత్రమే అమ్మాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

దర్శి: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం షాపుల్లో ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా బాటిళ్లను తనిఖీ చేసి మాత్రమే మద్యం విక్రయించాలని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. దర్శి నియోజకవర్గంలోని లైసెన్స్‌దారులు, మద్యం షాపుల్లో పని చేసే ఉద్యోగులతో ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఆయన సమావేశమయ్యారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మద్యం బాటిల్ స్కానింగ్ చేస్తే మద్యం సీసా ఎక్కడ తయారు చేశారు, ఇతర వివరాలు తెలుస్తాయన్నారు. బ్యాచ్ నంబర్, పరిమాణం, ప్రభుత్వం నిర్ణయించిన ధర తెలుసుకోవచ్చన్నారు. అనధికార షాపులకు మద్యం సరఫరా చేయవద్దని ఆదేశించారు.

ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌కు అంతరాయం



నిలిచిన ఏపీ ఫైబర్ ఇంటర్నెట్

కురిచేడు: ప్రభుత్వం ప్రజలకు తక్కువ ధరలకు ఇంటర్నెట్ అందించేందుకు ఏర్పాటు చేసిన ఏపీ ఫైబర్ ఇంటర్నెట్ వినియోగదారుల పాలిట శాపంగా మారింది. నిత్యం కనీసం నాలుగైదు సార్లు నెట్‌వర్క్ ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఏపీ ఫైబర్ నిలిచిపోయి సేవలు బంద్ అవుతున్నాయి. రోజుకు కనీసం పది గంటలపాటు సేవలు నిలిచిపోతున్నాయి. ఫీజులు మాత్రం ఏ మాత్రం తగ్గించకుండా ముందుగానే వసూలు చేసుకుని కాంట్రాక్టర్ లబ్ధిపొందుతున్నారే తప్ప ప్రజలకు అందించాల్సిన మెరుగైన ఇంటర్నెట్ అందించడంలో పూర్తిగా విఫలమయ్యారు. ప్రభుత్వం కూడా మెరుగైన ఇంటర్నెట్ సేవలు అందించేందుకు చర్యలు తీసుకోకపోవడంతో ప్రైవేట్ కంపెనీలతో కుమ్మక్కై ఇలా చేస్తున్నారా? అని వినియోగదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఇంటర్నెట్ సక్రమంగా రాకపోవడంతో ప్రైవేట్ నెట్‌వర్క్ సంస్థలు వారినెలా వారి ధరలు పెంచి వినియోగదారులను లూటీ చేస్తున్నారు. ఇప్పటికే బీఎస్ఎన్ఎల్‌ను ప్రజలకు దూరం చేసిన ప్రభుత్వాలు నేడు అదే బాటలో నడచి ఏపీ ఫైబర్‌ను సైతం ప్రజలకు దూరం చేసే ఆలోచనలో ఉన్నట్లు అర్థమవతుందని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ తీసుకుని ఏపీ ఫైబర్ ఇంటర్నెట్ సేవలను మెరుగు పరచాలని వినియోగదారులు కోరుతున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ



పుల్లలచెరువు: విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

పుల్లలచెరువు: చదువులో వెనుకబడిన విద్యార్థుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవోలు ఖాసిం, ఇందిర అన్నారు. మండలంలోని ఐటీవరం, మానేపల్లి గ్రామాల్లోని పాఠశాలలను బుధవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. ఎంఈవోలు మాట్లాడుతూ రికార్డులు పక్కాగా నిర్వహించాలని, తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు కూడా పెరగాలని, వారిలో సామర్థ్యాలు పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం విద్యార్థులందరూ పాఠశాలలోనే తినే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, సమయం పాటించి, విద్యార్థుల అభివృద్ధికి బాటలు వేయాలని ఉపాధ్యాయులకు ఎంఈవో సూచించారు.

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లి ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి–2 షేక్ అమీర్‌బాషా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించి కుకింగ్ నిర్వాహకులకు సలహాలందించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి సమాధానం రాబట్టుకున్నారు. చక్కగా చదవాలని, మంచి మార్కులు సాధించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సీఆర్‌పీలు ఉన్నారు.

జీవన ఎరువులే పంటకు జీవం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పెద్దారవీడు: ప్రతి పంటకు జీవం జీవన ఎరువులేనని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. మండలంలోని చట్లమిట్ల, ఏనుగులదిన్నెపాడు రైతు సేవా కేంద్రాల్లో బుధవారం రైతులతో వ్యవసాయాధికారులు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు తగ్గించి జీవన ఎరువులు వాడాలని తెలిపారు. రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడితే నేల చౌడు బారుతుందని, నేలలో మొక్కలకు మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోతాయన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని, నాణ్యతతో కూడిన దిగుబడిని సాధించవచ్చని చెప్పారు. జీవన ఎరువుల వినియోగంతో భూసారాన్ని పెంపొందించి పంటలో జీవవైవిధ్యాన్ని పెంపొందించడంలో సహాయ పడతాయని పేర్కొన్నారు. సేద్యం విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కందిలో వెర్రి తెగులు రాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. టీబీజీ 104 మినుము రకం పంట కాలం 80 నుంచి 85 రోజులు, ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ రకం విత్తనం పల్లాకు తెగులును తట్టుకుంటుందని, మినుములో ముందుగా నాటిన పొలాల్లో పల్లాకు తెగులు నివారించుకోవాల్సిన సమగ్ర పంట యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. మార్కాపురం ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ పత్తి పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం పథకం కింద 30 ఎకరాల్లో మినుము టీబీజీ 104 రకం విత్తనాలు ఉచితంగా రైతులకు పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి ఎన్. లక్ష్మీనారాయణ, వీఏఏలు రవి, మల్లు నాయక్, ఆత్మ ప్రాజెక్టు అధికారి వాణి, రైతులు పాల్గొన్నారు.